సాక్షి
విశాఖపట్నం
శనివారం । 4 । మే । 2024



ఈవీఎంల సప్లిమెంటరీ ర్యాండమైజేషన్ పూర్తి 10లో



వైఎస్సార్‌సీపీతో ముస్లింల బంధం విడదీయరానిది 10లో



పిల్లలు, వృద్ధులకు సదుపాయాలు కల్పించండి 10లో



అవస్థలు పడుతూ.. మెట్లు ఎక్కుతూ..

• బాబు కక్ష.. పెన్షనర్లకు శిక్ష

కన్నీరే తోడుగా..

- వచ్చ కుట్రలకు అభాగ్యుల పాట్లు
- మూడో రోజూ బ్యాంకుల వద్ద పడిగాపులు

మహారాణిపేట/సాక్షి నెట్‌వర్క్‌: ప్రతి నెలా ఒకటో తేదీన.. కోడి కూయకముందే వృద్ధులు, దివ్యాంగులు, వితంతువుల ఇంటికి పింఛన్‌ నడిచొచ్చేది. ఇంటి వద్దకే వలంటీర్లు వచ్చి నగదు అందించడంతో అవ్వాతాతల మోముల్లో ఆనందం వెల్లివిరిసేది. మందులు, ఇతర ఖర్చులకు నెలంతా వారు ఎవరి దగ్గరా చేయి చాపాల్సిన అవసరం ఉండేది కాదు. కానీ రెండు నెలలుగా ఒకటో తేదీ వచ్చిందంటే చాలు లబ్ధిదారుల్లో భయాందోళన కనిపిస్తోంది. పచ్చమూకల కుట్రకు పింఛన్‌ లబ్ధిదారులంతా రోడ్డున పడ్డారు. గత నెలలో పింఛన్‌ తీసుకునేందుకు సచివాలయాలకు వెళ్లి అష్టకష్టాలు పడ్డారు. ఈ నెలలో బ్యాంకుల వద్ద నరకయాతన అనుభవిస్తున్నారు. తమకు ఇన్ని కష్టాలు తెచ్చిపెట్టిన చంద్రబాబుపై లబ్ధిదారులంతా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఐదేళ్లుగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా సీఎం జగన్‌ చూసుకున్నారని.. ఇప్పుడు చంద్రబాబు కుట్రలతో మండుటెండలో రోడ్డునపడి తిరగాల్సి వస్తోందంటూ కన్నీటి పర్యంతమవుతున్నారు. 'నీకేం ద్రోహం చేశాం చంద్రబాబూ.. మమ్మల్ని ఇన్ని కష్టాలకు గురి చేస్తున్నావ్‌'అంటూ శాపనార్థాలు పెడుతున్నారు. కాగా.. పింఛన్‌ కోసం శుక్రవారం కూడా ఉదయాన్నే లబ్ధిదారులు బ్యాంకులకు చేరుకున్నారు. గంటల తరబడి నిలబడి కౌంటర్‌ దగ్గరకు వెళ్తే.. మీ బ్యాంకు ఖాతాలు కనిపించడం లేదని సిబ్బంది చెబుతుండటంతో నిస్సహాయతతో వెనుదిరుగుతున్నారు. మరికొందరికి పింఛను పడినా.. డబ్బులు కట్‌ అయిపోయాయనే సమాధానం వస్తుండటంతో తీవ్ర నిరాశకు గురవుతున్నారు. శుక్రవారం నాటికి డీబీటీ కింద 96.06 శాతం అంటే 1,18,134 మందికి పింఛన్లు అందించారు. డోర్‌టుడోర్‌ కింద 97.36 శాతం అంటే 41,497 మంది లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. ఇదిలా ఉండగా పింఛన్‌ సొమ్మును ఎటువంటి బకాయిలకు జమ చేసుకోవద్దని ప్రభుత్వం బ్యాంకులను ఆదేశించింది. బ్యాంకుల్లో జమ కాని లబ్ధిదారులకు శనివారం డోర్‌ టు డోర్‌ కింద వారికి పింఛన్‌ సొమ్ము అందించనున్నట్లు అధికారులు వెల్లడించారు.



ఆటోలో పింఛన్‌ డబ్బుల కోసం వచ్చిన వృద్ధులు



కలెక్టరేట్‌ ఆవరణలోని ఎస్‌బీఐ బ్రాంచ్‌ వద్ద పింఛన్‌ కోసం వృద్ధుల పడిగాపులు

చంద్రబాబూ నీకిది తగునా?



ప్రతి నెలా ఒకటో తేదీన తెల్లవారకముందే పింఛన్‌ తెచ్చి ఇచ్చే వలంటీర్ల సేవలు నిలుపుదల చేయడం వల్ల రెండు నెలలుగా ఇబ్బందులు పడుతున్నాం. పింఛన్‌ కోసం గత నెల వార్డు సచివాలయానికి వెళ్లాను. ఇప్పుడు బ్యాంక్‌లకు వెళ్లాలంటే మాలాంటోళ్లకు ఎంత ఇబ్బందో ఆలోచించకపోవడం దారుణం. టీడీపీ కుట్రల వల్ల బ్యాంక్‌ వద్ద పడిగాపులు కాయాల్సి వస్తోంది. మనసున్న జగన్‌ వలంటీర్‌ వ్యవస్థను ఏర్పాటు చేసి ఇంటికే పింఛన్‌ అందజేశారు. చంద్రబాబు రాజకీయం కోసం దిగజారి నాలాంటి నిర్భాగ్యులను ఇబ్బంది పెట్టడం దుర్మార్గం. ఓటుతో తగిన బుద్ధి చెబుతాం. – సర్వసిద్ధి చిన్నప్పన్న, దివ్యాంగుడు, కొత్తూరు కాలనీ

రెండు నెలలుగా ఇబ్బందులు



ఐదేళ్ల పాటు ఉదయాన్నే వలంటీర్లు ఇంటికి వచ్చి పింఛన్లు అందజేశారు. చంద్రబాబు కుట్ర రాజకీయాలతో రెండు నెలలుగా పింఛన్‌ కోసం పడుతున్న ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. ఈ నెలలో బ్యాంకుకు వెళ్లి డబ్బులు తీసుకోవడం చాలా కష్టమైంది. వలంటీర్ల ద్వారా పింఛన్‌ అందించే ప్రభుత్వమే రావాలి.
– అంగ రామాయమ్మ, వృద్ధాప్య పింఛన్‌దారు, అక్కిరెడ్డిపాలెం

చంద్రబాబు బాగుపడడు



నేను 13వ వార్డు రామకృష్ణాపురంలో ఉంటాను. నా బ్యాంక్‌ ఖాతా విశాలాక్షినగర్‌లోని యూనియన్‌ బ్యాంక్‌లో ఉంది. ఈ ఖాతాలోనే ఈ నెల పింఛన్‌ డబ్బులు వేశారు. మండుటెండలో ఆటోలో వెళ్లి ఈ డబ్బులను తీసుకున్నాను. ఇప్పుడు చంద్రబాబు మాకు ఇన్ని కష్టాలు తెచ్చిపెట్టాడు. చంద్రబాబు బాగుపడడు. – పెందుర్తి దాలమ్మ, రామకృష్ణాపురం, 13వ వార్డు

జగన్‌ ఉంటే ఈ కష్టాలు ఉండవు



రెండు నెలల నుంచి పింఛన్‌ తీసుకోవడానికి అవస్థలు పడుతున్నాం. ఈ వయసులో ఎండలో బ్యాంక్‌కు వెళ్లాలంటే ఎవరో ఒకరిని తోడు తీసుకెళ్లాలి. వాళ్ల పనుల మీద వాళ్లు ఉంటారు. వారిని ఇబ్బంది పెట్టడం సరైనది కాదు. చంద్రబాబు చేసిన దానికి మేమంతా ఇబ్బంది పడుతున్నాం. ఐదేళ్లలో ఎప్పుడూ ఇబ్బంది పడలేదు. ఇంటి వద్దే పింఛన్‌ అందుకున్నాం. ఎంత త్వరగా ఎన్నికలు పూర్తయి.. మళ్లీ జగన్‌ సీఎం అయితే మా కష్టాలు తీరుతాయి.
– పొన్నాడ బాలాజీ, వృద్ధుడు, మురళీనగర్‌ సెక్టార్‌–8, 50వ వార్డు

మా ఉసురు తగులుతుంది



ఎప్పటిలాగే ఒకటో తారీఖున ఇంటికి వచ్చి పింఛన్‌ ఇస్తారనుకున్నాను. ఇంటికి ఎవరూ రాకపోవడంతో ఈ రోజు సచివాలయానికి వెళ్లి అడిగాను. డబ్బులు బ్యాంక్‌ ఖాతాలో పడ్డాయని సిబ్బంది చెప్పారు. నా ఖాతా ఆరిలోవ ఎస్‌బీఐలో ఉంది. ఎండలు ఎక్కువగా ఉండటంతో బ్యాంక్‌కు వెళ్లలేకపోయాను. మందులు కొనడానికి కూడా నా వద్ద డబ్బులు లేవు. ఇంతకు ముందు వలంటీర్లు ఇంటికి వచ్చి డబ్బులు ఇచ్చే వారు. వెంటనే నా అవసరాలు తీరేవి. చంద్రబాబు చేసిన పనికి మాలాంటోళ్లం ఇబ్బంది పడుతున్నాం.
– మర్రిపూడి కనకదుర్గ, పైనాపిల్‌కాలనీ

ఇంత కష్టపెడతారా?



రెండు నెలల నుంచి పింఛన్‌ తీసుకునేందుకు నానా అవస్థలు పడుతున్నాం. గత నెలలో సచివాలయంలో పింఛన్‌ ఇస్తారని చెబితే అక్కడకు వెళ్లాం. ఈ నెల బ్యాంక్‌లో డబ్బులు వేశామని సచివాలయ సిబ్బంది చెప్పారు. మా ఇంటికి బ్యాంక్‌ చాలా దూరం. మండుటెండలో అంత దూరం వెళితే.. బ్యాంక్‌లో జనం బారులుదీరి ఉన్నారు. నానా అవస్థలు పడాల్సి వచ్చింది. వలంటీర్లు ఇంటికి వచ్చి పింఛన్‌ అందించే విధానమే బాగుంది. వైఎస్సార్‌ సీపీ ప్రభుత్వం వస్తేనే మాలాంటి వాళ్లకు మేలు జరుగుతుంది.
– సుంకరి ఈశ్వరమ్మ, గాజువాక

గనులపై కన్ను... పోటీకి దన్ను

అనకాపల్లికి వచ్చింది అందుకేనా ?

భారీ బెల్లం మార్కెట్‌తోపాటు మైనింగ్‌కు కేంద్రంగా ఉన్న అనకాపల్లిలో ఎంపీగా పోటీ చేసేందుకు పక్కా ప్లాన్‌తోనే సీఎం రమేష్‌ రంగప్రవేశం చేసినట్టు తెలుస్తోంది. ఇక్కడ ఉన్న కొండలను పిండి చేసి అక్రమార్జనకు తెరలేపేందుకే ఇంత దూరం వచ్చినట్టు స్పష్టమవుతోంది. ప్రధానంగా అనకాపల్లి చుట్టుపక్కలున్న మైన్లతోపాటు నర్సీపట్నంలో ఉన్న రంగురాళ్లను దోచేందుకే చంద్రబాబు డైరెక్షన్‌లో అడుగుపెట్టారనే చర్చ నడుస్తోంది. పార్లమెంటు సభ్యుడిగా బరిలో నిలిచేందుకు బీ–ఫారం తీసుకునే సమయంలో పక్కనే మైనింగ్‌ డాన్‌ ఉండటం ఈ విమర్శలకు బలం చేకూరుస్తోంది.





బీజేపీ ప్రతినిధుల నుంచి బీ–ఫారం అందుకుంటున్న సీఎం రమేష్‌, వృత్తంలో ఉన్న వ్యక్తి వీవీఆర్‌ స్టోన్‌ క్రషర్స్‌ అధినేత శ్రీనివాస్‌ చౌదరి

- అక్రమ మైనింగ్‌పై సీఎం రమేష్‌ కన్ను
- మైనింగ్‌ డాన్‌ శ్రీనుతో సత్సంబంధాలు
- బీ–ఫారం ఇచ్చే సమయంలో ఇద్దరూ చెట్టాపట్టాల్‌
- కొండలను, రంగురాళ్లను దోచుకునే పక్కా ప్లాన్‌

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం: చంద్రబాబు చెబితేనే వచ్చాను.. ఉత్తరాంధ్రకు పెద్దదిక్కుగా ఉంటానని ప్రకటించుకున్న సీఎం రమేష్‌ మాటల్లో మర్మం ఇప్పుడు అందరికీ అర్థమవుతోంది. టీడీపీ ప్రభుత్వ హయాంలో అనకాపల్లిలోని కొండలను నుగ్గు చేసి భారీగా అక్రమ తవ్వకాలు చేపట్టిన వెంగమాంబ శ్రీనుతో కలిసి బీ–ఫారం తీసుకున్న ఫొటోలు చక్కర్లు కొట్టడంతో నాన్‌ లోకల్‌ నేత పక్కా స్కెచ్‌ తేటతెల్లమవుతోంది. వెంగమాంబ పేరుతో మైనింగ్‌ అధికారులను వెర్రిమాలోకాలను చేసి అక్రమ మైనింగ్‌తో దర్జాగా కోట్లాది రూపాయల మేర దండుకున్న చరిత్ర శ్రీనివాస్‌ చౌదరికి ఉంది. ఖజానాకు రావాల్సిన రాయల్టీ వగైరాలను ఎగ్గొట్టి సొంత జేబులు నింపుకున్న సదరు ఉల్లంఘనుడి సహాయ సహకారాలతో ఇప్పుడు అనకాపల్లి ఎంపీగా పోటీ చేస్తుండటంతో ఈ అనుమానాలు మరింతగా బలపడుతున్నాయి. అంతేకాకుండా తనకు తానుగా ఉత్తరాంధ్రకు పెద్దదిక్కుగా చెప్పుకుంటూ ఇటు అల్లూరి నుంచి అటు శ్రీకాకుళం జిల్లా వరకు ఉన్న వనరులను దోచేందుకే ఉత్తరాంధ్రకు పెద్దదిక్కుగా ఉంటానంటూ చెప్పుకుంటున్నట్టు తెలుస్తోంది. మొత్తంగా అనకాపల్లి జిల్లాలోని గనులను దోచుకునేందుకే ఈ ఘనుడు వచ్చాడని అర్థమవుతోంది.

ఇదీ వెంగమాంబ బాగోతం...!

వాస్తవానికి అనకాపల్లి ఎంపీ బరిలో సీఎం రమేష్‌ ఉండాలని నిర్ణయించుకున్న సమయంలోనే మైన్స్‌పై ఆరా తీసినట్టు తెలుస్తోంది. గతంలో తెలుగుదేశం పార్టీకి దగ్గరగా ఉండి... 2019 ఎన్నికల్లో టీడీపీ ఓడిపోయిన తర్వాత వెంగమాంబ క్వారీ సంస్థ అధినేత శ్రీనివాస్‌ చౌదరి బీజేపీకి దగ్గరగా వెళ్లారు. ఈ పరిస్థితుల్లో సీఎం రమేష్‌ కూడా శ్రీనివాస్‌ చౌదరికి దగ్గరయ్యారు. ఎంతగా దగ్గరయ్యారంటే.... బీ–ఫారం తీసుకునే సమయంలోనే అక్రమ మైనింగ్‌ వీరుడితో చెట్టాపట్టాలేసుకునేంతగా.. అక్రమ మైనింగ్‌ డాన్‌గా వీవీఆర్‌ స్టోన్‌ క్రషర్స్‌ అధినేత శ్రీనివాస్‌ చౌదరికి పెట్టింది పేరు. అక్రమ మైనింగ్‌ అధికారులతో కుమ్మక్కై కోట్లాది విలువ చేసే వనరులను దోచుకున్న వెంగమాంబ శ్రీనివాస్‌ చౌదరి ఇటీవల మళ్లీ తెరపైకి వచ్చాడు. అనకాపల్లి బీజేపీ ఎంపీ అభ్యర్థిగా వచ్చిన సీఎం రమేష్‌కు అత్యంత ఆప్తుడిగా ఎన్నికల ప్రచారాల్లో శ్రీనివాస్‌ చౌదరి ప్రచారం చేస్తున్నాడు. సీఎం రమేష్‌ ఎంపీ అయితే జిల్లాలో ఎక్కడా కొండలు లేకుండా అనకొండ శ్రీనివాస్‌ చౌదరి దోచుకుంటారనే అనుమానాలున్నాయి. అయితే కడప నుంచి వచ్చిన సీఎం రమేష్‌ లాంటి వారిని ఓడగొడితేనే ఇలాంటి వాళ్ల ఆగడాలకు అడ్డుకట్ట వేయగలమని స్థానిక ప్రజలు భావిస్తున్నారు. అనకాపల్లి మండలం సీతానగరంలో సర్వే నెం.193, 303లో వీవీఆర్‌ స్టోన్‌ క్రషర్స్‌ ఖనిజ సంపదను అక్రమంగా దోచేసి మైనింగ్‌ చేయడంతో మైన్స్‌ శాఖ విజిలెన్స్‌, ఎన్‌ఫోర్స్‌మెంట్‌ అధికారులు గత ఏడాది జూలై 8న క్షేత్రస్థాయిలో తనిఖీలు చేసి శ్రీనివాస్‌ చౌదరికి దాదాపు రూ.33 కోట్ల జరిమానా విధించారు. అయినా లెక్కచేయకుండా మైనింగ్‌ డాన్‌ శ్రీనివాస్‌ చౌదరి స్థానిక మైనింగ్‌ అధికారులతో చేతులు కలిపి యథేచ్ఛగా మైనింగ్‌ కొనసాగిస్తున్నారు. వందలాది లారీల్లో ఖనిజం తరలిపోతుందని స్థానికులు చేసిన ఫిర్యాదులను సైతం అధికారులు పట్టించుకోవడం లేదు. ప్రభుత్వమంటే లెక్కలేనితనం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. జరిమానాకు సంబంధించి నోటీసులు జారీ చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించారని, శ్రీనివాస్‌ చౌదరి ఆగడాలకు తొత్తులుగా పనిచేస్తున్నారని అప్పట్లో ముగ్గురు అధికారులను, విశాఖ డిప్యూటీ డైరెక్టర్‌గా పనిచేస్తున్న డీవీవీ సత్యనారాయణరెడ్డిని ఏలూరు బదిలీ చేశారు. వెంగమాంబ స్టోన్‌ క్రషర్స్‌లో జరిగిన దోపిడీ అంతా ఇంతా కాదు. ఏకంగా 5 లక్షల 68 వేల 923 క్యూబిక్‌ మీటర్ల ఖనిజం దోచుకున్నారని మైన్స్‌ విజిలెన్స్‌, ఎన్‌ఫోర్స్‌మెంట్‌ ఏడీ ప్రతాప్‌రెడ్డి అప్పట్లో నిర్ధారించారు. దీనికి రూ.32.36 కోట్ల మేర జరిమానా విధించారు. అయినప్పటికీ ఆగకుండా అక్రమ మైనింగ్‌ చేశారనే ఆరోపణలున్నాయి. వాస్తవానికి గ్రామీణ జిల్లాగా పచ్చని వ్యవసాయ గ్రామాలతో ఉన్న అనకాపల్లి జిల్లాలో ఎంతో విలువైన ఖనిజ సంపద ఉంది. ఇప్పటికే శ్రీనివాస్‌ చౌదరి లాంటి అక్రమ మైనింగ్‌ డాన్‌లు జిల్లాలో ఖనిజాన్ని దోచేస్తున్నారు. వీరికి తోడు సీఎం రమేష్‌ లాంటి వాళ్లు వస్తే జిల్లాను పూర్తిగా సర్వనాశనం చేసే పరిస్థితి ఎదురుకావచ్చు.

చంద్రబాబు డైరెక్షన్‌లోనే..

వైఎస్సార్‌ కడప జిల్లాకు చెందిన సీఎం రమేష్‌ మొదటి నుంచీ తెలుగుదేశం పార్టీలో క్రియాశీలంగా ఉన్నారు. ఆ పార్టీ నుంచే రాజ్యసభ సభ్యుడిగా ఎంపికయ్యారు. ఆ తర్వాత చంద్రబాబు డైరెక్షన్‌లోనే బీజేపీలో చేరారు. అయినప్పటికీ ఆయన రాజ్యసభ అభ్యర్థిత్వంపై వేటు పడలేదు. దర్జాగా చివరి వరకూ ఆ పదవిని అనుభవించారు. తిరిగి రాజ్యసభకు వెళ్లాలని భావించినప్పటికీ ఆ అవకాశాన్ని బీజేపీ ఇవ్వలేదు. ఈ నేపథ్యంలో బీజేపీతో పొత్తు కుదుర్చుకునేందుకు తహతహలాడిన చంద్రబాబు... అనకాపల్లి పార్లమెంటు సీటును మాత్రం తన వ్యక్తికే ఉండాలని భావించారు. మొదటగా ఈ సీటు నుంచి నాగబాబు పోటీ చేయాలని భావించారు. ఇందుకు అనుగుణంగా పావులు కూడా కదిపారు. అనకాపల్లి పార్లమెంటు పరిధిలో ఉన్న భారీ గనులను దృష్టిలో ఉంచుకున్న బాబు... ఈ సీటు నుంచి నాగబాబు బరిలో ఉండటాన్ని ఇష్టపడలేదు. దీని ఫలితంగానే ఈ సీటును బీజేపీ గట్టిగా కోరడం... పవన్‌ ఈ సీటును వదులుకోవడం జరిగిపోయాయి. ఫలితంగా సీఎం రమేష్‌ తెర మీదకు వచ్చారు. ఈ వ్యవహారమమంతా బాబు డైరెక్షన్‌లోనే జరిగిందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

చందనోత్సవంలో సామాన్యులకు పెద్దపీట

- దర్శన టికెట్లు పదివేల వరకు కుదింపు
- రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్‌ సత్యనారాయణ



మాట్లాడుతున్న దేవదాయశాఖ కమిషనర్‌ సత్యనారాయణ, కలెక్టర్‌ మల్లికార్జున

సింహాచలం: చందనోత్సవంలో సామాన్య భక్తులకు పెద్దపీట వేస్తామని రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్‌ సత్యనారాయణ చెప్పారు. ఈ నెల 10న వరాహ లక్ష్మీనృసింహస్వామి చందనోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు కలెక్టర్‌ మల్లికార్జున ఆధ్వర్యంలో పకడ్బందీగా ఏర్పాట్లు జరుగుతున్నాయని తెలిపారు. కలెక్టర్‌ మల్లికార్జున, జీవీఎంసీ కమిషనర్‌ సాయికాంత్‌వర్మ, నగర సంయుక్త సీపీ ఫకీరప్పతో కలిసి శుక్రవారం మధ్యాహ్నం సింహగిరిపై ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఈ సారి 29,500 మంది భక్తులు ఒకేసారి వేచి ఉండేలా ఏడు కిలోమీటర్ల మేర దర్శనాల క్యూలు ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. కలెక్టర్‌ మల్లికార్జున మాట్లాడుతూ చందనోత్సవం రోజు తెల్లవారు జామున 3.30 నుంచి 4.30గంటల మధ్య మాత్రమే దేవస్థానం అనువంశిక ధర్మకర్త కుటుంబానికి, హైకోర్టు, సుప్రీంకోర్టు న్యాయమూర్తులు, దాతలకు మాత్రమే అంతరాలయ దర్శనం కల్పించడం జరుగుతుందన్నారు. ఆ తర్వాత మరెవరికీ అంతరాలయ దర్శనాలు ఉండవని తెలిపారు. గతేడాది మంచినీటి సరఫరా కేంద్రాలు 130 ఉంటే ఈ సారి 180కి పెంచినట్లు తెలిపారు. మొబైల్‌ టాయిలెట్లు 240, 200 వరకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు.

టికెట్ల కుదింపు : గతేడాది రూ. 300, రూ.1000, రూ.1500 టికెట్లు 49 వేలు జారీ చేయగా ఈ ఏడాది 35 వేలు మాత్రమే జారీ చేసినట్లు కలెక్టర్‌ తెలిపారు. 11 చోట్ల టికెట్ల స్కానర్లు పెడతామన్నారు. భక్తులకు ఎండ వేడి తగలకుండా క్యూలైన్లపై షామియానాలు ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. ట్రాఫిక్‌ ఇబ్బందులు లేకుండా ఈసారి 40 పెద్ద బస్సులు, 40 మినీ బస్సులు,15 వరకు ఇన్నోవా వెహికల్స్‌ మాత్రమే నడపడం జరుగుతుందన్నారు. జాయింట్‌ పోలీస్‌ కమిషనర్‌ ఫకీరప్ప మాట్లాడుతూ 2590 మంది సివిల్‌ పోలీస్‌, నాలుగు ప్లాటూన్‌ ఏఆర్‌, స్పెషల్‌ రోప్‌పార్టీలతో చందనోత్సవం బందోబస్తు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. అన్ని శాఖల అధికారులతో జాయింట్‌ కమాండ్‌ కంట్రోల్‌ రూమ్‌ ఏర్పాటు చేయనున్నట్టు వెల్లడించారు. సింహాచలం దేవస్థానం ఈవో ఎస్‌.శ్రీనివాసమూర్తి మాట్లాడుతూ కొండదిగువ ఆరుచోట్ల వాహనాల హోల్డింగ్‌ పాయింట్లు ఏర్పాటు చేశామని, అక్కడ మజ్జిగ, మంచినీరు అందించడం జరుగుతుందన్నారు. సమావేశంలో జీవీఎంసీ సయుక్త కమిషనర్‌ విశ్వనాథ్‌, దేవస్థానం అధికారులు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

చందనోత్సవ టికెట్ల విక్రయాలు ప్రారంభం

చందనోత్సవ టికెట్ల విక్రయాలను శుక్రవారం రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్‌ ఎస్‌.సత్యనారాయణ ప్రారంభించారు. తొలి టికెట్‌ను కమిషనర్‌ కొనుగోలు చేశారు. ఈసారి టికెట్ల రూపకల్పన పకడ్బందీగా చేసినట్లు చెప్పారు. రూ. 300, రూ.1000 టికెట్లు సింహగిరిపై ఉన్న ప్రత్యేక కౌంటర్‌తో పాటు మహారాణిపేట, అక్కయ్యపాలెంలోని యూనియన్‌ బ్యాంకులతో పాటు సింహాచలం, సాలిగ్రామపురం (అక్కయ్యపాలెం బ్రాంచ్‌), బిర్లా జంక్షన్‌లోని స్టేట్‌ బ్యాంక్‌ ఆఫ్‌ ఇండియా బ్రాంచ్‌ల్లో ఈనెల 7వ తేదీ వరకు టికెట్లు అందుబాటులో ఉంటాయని దేవస్థానం ఈవో ఎస్‌.శ్రీనివాసమూర్తి తెలిపారు. ఒక దరఖాస్తుపై 4 టికెట్లు మాత్రమే జారీ చేయనున్నట్టు వెల్లడించారు. అలాగే www.aptemples.ap.gov.in వెబ్‌సైట్‌ ద్వారా టికెట్లు లభ్యమవుతాయని పేర్కొన్నారు.

ఆనందపురంలో టీడీపీకి షాక్‌

- వైఎస్సార్‌ సీపీలో చేరిన టీడీపీ ఆనందపురం మండల అధ్యక్షుడు బొద్దాపు శ్రీను
- ఆహ్వానించిన వైఎస్సార్‌ సీపీ రీజినల్‌ కో ఆర్డినేటర్‌ వైవీ సుబ్బారెడ్డి



బొద్దాపు శ్రీనును వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానిస్తున్న పార్టీ రీజనల్‌ కో ఆర్డినేటర్‌ వైవీ సుబ్బారెడ్డి, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, తోట రాజీవ్‌, తదితరులు

మధురవాడ : సార్వత్రిక ఎన్నికలు కీలక దశకు చేరుకున్న వేళ పలువురు వైఎస్సార్‌ సీపీలో చేరారు. మధురవాడ ఐటీ సెజ్‌ జంక్షన్‌ వద్ద గల వైవీ సుబ్బారెడ్డి నివాసంలో ఇద్దరు కీలక నాయకులు శుక్రవారం పార్టీలో చేరారు. ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ నాయకుడు తోట రాజీవ్‌, దాట్ల పెద్దబాబు ఆధ్వర్యంలో టీడీపీ ఆనందపురం మండల అధ్యక్షుడు బొద్దాపు శ్రీను, నాయకులు బొద్దాపు ప్రసాద్‌, పతివాడ శ్రీనివాస్‌ అనుచరులతో కలిసి పార్టీలో చేరారు. అలాగే 32 ఏళ్లపాటు మావోయిస్టు పార్టీలో కీలకంగా పనిచేసిన సీనియర్‌ నాయకుడు, అల్లూరి సీతారామరాజు జిల్లా హుకుంపేట మండలం మొళియాపుట్టుకు చెందిన చడ్డా భూషణం పార్టీలో చేరారు. వీరికి వైఎస్సార్‌సీపీ రీజినల్‌ కో ఆర్డినేటర్‌ వైవీ సుబ్బారెడ్డి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా వైవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌ రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి అవుతారన్నారు. పార్టీలో చేరిన వారికి సముచిత స్థానం కల్పిస్తామని, వారికి ఎప్పటికీ గౌరవం తగ్గదని చెప్పారు. గత ఐదేళ్లలో సీఎం జగన్‌ అమలు చేసిన సంక్షేమ పథకాలు పేదరికాన్ని తగ్గించడంతోపాటు పేదలకు విద్య, వైద్యం, ఇళ్లు వంటి వాటిని చేరువ చేశాయన్నారు. సమాజానికి మేలు చేస్తున్న కార్యక్రమాలు, సంక్షేమ పాలన, అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై పలువురు వైఎస్సార్‌సీపీలో చేరుతున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పాడేరు నియోజకవర్గ పరిశీలకురాలు పీలా వెంకటలక్ష్మి, భీమిలి మార్కెట్‌ కమిటీ చైర్మన్‌ యలమంచిలి సూర్యనారాయణ, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రీజినల్‌ కో ఆర్డినేటర్‌ ముత్తంశెట్టి నందేశ్‌బాబు పాల్గొన్నారు.

బ్యాలెట్‌ పత్రాల ముద్రణ పూర్తి

మహారాణిపేట: అసెంబ్లీ, పార్లమెంట్‌ బ్యాలెట్‌ పత్రాల ముద్రణ పూర్తయింది. కొన్ని అసెంబ్లీ నియోజకవర్గాల బ్యాలెట్‌ పత్రాలు ఇప్పటికే విశాఖకు చేరుకున్నాయి. పార్లమెంట్‌ నియోజకవర్గ బ్యాలెట్‌ పత్రాలు కర్నూలు జిల్లా ప్రభుత్వ ప్రింటింగ్‌ కార్యాలయం నుంచి శనివారం విశాఖకు చేరే అవకాశం ఉంది. విశాఖ పార్లమెంట్‌ పరిధిలో మొత్తం 45,350 బ్యాలెట్‌ పత్రాలు ముద్రణ పూర్తి చేశారు. పది శాతం రిజర్వ్‌, ఒక్కో పోలింగ్‌స్టేషన్‌లో టెండర్‌ ఓటింగ్‌ కోసం అదనంగా 20 బ్యాలెట్‌ పత్రాలు కలిపి ఆర్డర్‌ ఇచ్చారు. విశాఖపట్నం పార్లమెంట్‌ నియోజకవర్గం పరిధిలో 1,962 పోలింగ్‌ స్టేషన్లు ఉన్నాయి. ఎస్‌.కోట అసెంబ్లీలో 270 పోలింగ్‌ స్టేషన్లు, విశాఖ తూర్పు 293, విశాఖ దక్షిణం 237, విశాఖ ఉత్తరం 295, విశాఖ పశ్చిమం 222, గాజువాకలో 306 పోలింగ్‌ స్టేషన్లు ఉన్నాయి. విశాఖ పార్లమెంట్‌ స్థానానికి మొత్తం 33 మంది పోటీ చేస్తున్నారు. ఒక ఈవీఎంలో 16 మంది, రెండో ఈవీఎంలో మరో 16 మంది, మరో ఈవీఎంలో మరొకరు, నోటా ఉంటుంది.

వైఎస్సార్‌ సీపీ విజయమే లక్ష్యంగా..

- ఎన్‌ఆర్‌ఐల బస్‌ క్యాంపెయిన్‌ ప్రారంభం
- ఐటీ వింగ్‌ సేవలను కొనియాడిన ఎంపీ వై.వి.సుబ్బారెడ్డి



బస్సు క్యాంపెయిన్‌ను ప్రారంభిస్తున్న వై.వి.సుబ్బారెడ్డి, బొత్స ఝాన్సీ

ఎంవీపీకాలనీ: సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌ సీపీ గెలుపే లక్ష్యంగా ఎన్‌ఆర్‌ఐలు బస్సు క్యాంపెయిన్‌కు శుక్రవారం శ్రీకారం చుట్టారు. లాసన్స్‌ బే కాలనీలోని వైఎస్సార్‌ సీపీ విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ కార్యాలయం వేదికగా ఈ బస్సు క్యాంపెయిన్‌ ప్రారంభమైంది. రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్‌ సీపీ రీజినల్‌ కో ఆర్డినేటర్‌ వై.వి.సుబ్బారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని.. బొత్స ఝాన్సీతో కలిసి ఎన్‌ఆర్‌లు, ఐటీ అండ్‌ ఇంటలెక్చువల్స్‌ ఆధ్వర్యంలో చేపట్టిన బస్సు క్యాంపెయిన్‌ ప్రారంభించారు. ఈ సందర్భంగా వైవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఎన్నికల్లో వైఎస్సార్‌ సీపీ విజయం తథ్యమన్నారు. పార్టీ విజయం కోసం అనుబంధ సంఘాలు చేస్తున్న కృషిని కొనియాడారు. ముఖ్యంగా ఎన్‌ఆర్‌ఐలు పార్టీ గెలుపు కోసం బస్సు క్యాంపెయిన్‌ చేపట్టడం అభినందనీయమన్నారు. తొలుత ఈ బస్సు క్యాంపెయిన్‌ విశాఖ పార్లమెంట్‌ నియోజకవర్గం పరిధిలో జరుగుతుందన్నారు. అనంతరం రాష్ట్ర వ్యాప్తంగా పలు పార్లమెంట్‌ నియోజకవర్గాల పరిధిలో ఈ నెల 11 వరకు కొనసాగుతుందన్నారు. ఈ క్యాంపెయిన్‌ ద్వారా వైఎస్సార్‌ సీపీ గెలుపు ఆవశ్యకతను ఎన్‌ఐఆర్‌ ప్రతినిధులు ఓటర్లకు వివరిస్తారన్నారు. ఎన్‌ఆర్‌లు, ఐటీ అండ్‌ ఇంటలెక్చువల్స్‌ ప్రతినిధి రత్నాకర్‌, పిల్లి సంతోష్‌ (సింగపూర్‌ కన్వీనర్‌), వేణుగోపాల్‌ చుక్కలూరి (కెనడా కన్వీనర్‌), అస్లం(యూఎస్‌ఏ), రామిరెడ్డి (కెనడా), సునీల్‌(యూఎస్‌ఏ), వెంకట్‌ (దుబాయ్‌), కిరణ్‌(యూఎస్‌ఏ)లతో పాటు విశాఖ జిల్లా ఐటీ ప్రొఫెషనల్స్‌ ఉమా, జగదీష్‌, బెహరా, వెంకట్‌ పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో ఐటీ ప్రొఫెషనల్స్‌ హాజరయ్యారు.

అదనంగా పెంచిన ఫీజు అమలుకు చరమ'గీతం'

సాక్షి ఎఫెక్ట్..

కొమ్మాది : రుషికొండలో ఉన్న గీతం డీమ్డ్ వర్సిటీలో బీటెక్, డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థులు 40% అదనంగా ఫీజు చెల్లించాలని యాజమాన్యం తెలపడంతో గురువారం విద్యార్థులు ఆందోళనకు దిగిన విషయం తెలిసిందే. ఇక్కడ బీటెక్, డిగ్రీలలో నిర్వహించే సెమ్‌లలో 40 శాతం మార్కులు వస్తే ఉత్తీర్ణత సాధించినట్లు నిర్ధారిస్తారు. అయితే ఉత్తీర్ణత సాధించిన వారికి ఫైనల్‌గా మరో 40 శాతం అదనంగా ఫీజు కట్టాలని, కొత్తగా ఓ వెబ్‌సైట్ తీసుకుని వచ్చామని, దాని నిమిత్తం ఈ అధిక మొత్తాన్ని చెల్లించాలని యాజమాన్యం తెలిపినట్లు విద్యార్థులు తెలిపారు. ఇది ఎన్నికల ఫండ్స్ కోసం ఇలా చేస్తున్నారని విద్యార్థులు ఆరోపించారు. దీనిపై శుక్రవారం 'సాక్షి'లో గీతం విద్యార్థుల ఆందోళన అనే శీర్షికతో వార్త ప్రచురణ కావడం, విషయం బయటకు తెలియడంతో చేసేదేమి లేక 40 శాతం అదనపు ఫీజు చెల్లించాలనే విషయాన్ని ఉపసంహరించుకున్నట్లు విద్యార్థులు తెలిపారు. కాగా, వాస్తవానికి ఒక సెమ్ ఫీజు రూ.6 వేలు ఉండగా, రూ.10 వేలు చెల్లించాలని గురువారం గీతం యాజమాన్యం విద్యార్థులపై ఒత్తిడి తెచ్చింది. అయితే విద్యార్థులు ఆందోళనతో ప్రస్తుతానికి 40 శాతం సెమ్ ఫీజు ఆలోచన విరమించుకున్నప్పటికీ ఎన్నికల తరువాత తిరిగి పెంచేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం.

స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటుపరం కానివ్వం

- వైఎస్సార్‌సీపీ విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ, చిత్రంలో ఎమ్మెల్యే అభ్యర్థి అమర్‌నాథ్

పెదగంట్యాడ: విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు నినాదంతో, ఎందరో మహనీయుల త్యాగంతో సాధించుకున్న విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటుపరం కాకుండా అడ్డుకుంటామని వైఎస్సార్‌సీపీ విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ అన్నారు. ఐఎన్‌టీయూసీ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని యూనియన్ జాతీయ కార్యదర్శి మంత్రి రాజశేఖర్ ఆధ్వర్యంలో 76వ వార్డు నడుపూరులో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. తాను స్టీల్ కమిటీ మెంబర్‌గా ఉన్న సమయంలో స్టీల్‌ప్లాంట్ నష్టాల్లో ఉండగా కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి రూ.8,900కోట్లు మంజూరు చేయించామని గుర్తు చేశారు. తాను ఈ ప్రాంత ఆడపడుచునని, ఇక్కడి వారంతా తనకు అండగా ఉండాలని కోరారు.

ప్రధాని అలా ప్రకటిస్తే రాజకీయాలు వదిలేస్తా: అమర్‌నాథ్

వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అమర్‌నాథ్ మాట్లాడుతూ ఈ నెల 6న అనకాపల్లి వస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటుపరం చేయబోమంటూ ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. ప్రధాని ప్రకటన చేసిన వెంటనే తాను మంత్రి పదవితో పాటు రాజకీయాలను వదిలేస్తానని ప్రకటించారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా 1177 రోజులుగా ఉద్యోగులు, కార్మికులు ఆందోళనలు చేస్తున్నారని, వారికి వైఎస్సార్‌సీపీ అండగా ఉందని అన్నారు. ఏది ఏమైనా విశాఖ ఉక్కును ప్రైవేటుపరం కానివ్వమన్నారు. మాకు పదవి కంటే కార్మికుల శ్రేయస్సే ముఖ్యమన్నారు. ముందునుంచి ఉక్కు కార్మికుల దీక్షకు అండగా ఉన్నామని, ఉక్కు పరి రక్షణకు కట్టుబడి ఉన్నామని పేర్కొన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి బీహెచ్‌పీవీని భెల్‌లో విలీనం చేసి ఆ సంస్థను కాపాడారని గుర్తు చేశారు. చంద్రబాబు నాయడు హయాంలో అనేక సంస్థలను నిర్వీర్యం చేశారని ఆరోపించారు. స్టీల్‌ప్లాంట్‌ను కూడా అప్పట్లో ప్రైవేటుపరం చేయడానికి ప్రయత్నం చేశారని, ఆ సమయంలో ఉక్కు ఉద్యోగులు ఆందోళనకు దిగితే వారిపై లాఠీ చార్జీ చేయించిన సంగతిని ఈ ప్రాంత ప్రజలు మరిచిపోరన్నారు. సమావేశంలో ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు తిప్పల గురుమూర్తిరెడ్డి, చింతలపూడి వెంకట్రామయ్య, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు కోలా గురువులు, నాయకులు తిప్పల దేవన్‌రెడ్డి, వై.మస్తానప్ప, మంత్రి శంకరనారాయణ, నీరుకొండ రామచంద్రరావు, మార్టుపూడి పరదేశి, గంట్యాడ గురుమూర్తి, పల్లా చినతల్లి, మాటూరి శ్రీనివాసరావు, గొందేశి ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీతో ముస్లింల బంధం విడదీయరానిది

- వారి ఆకాంక్షలు నెరవేరుస్తాం
- ఆత్మీయ సమావేశంలో రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్, రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి

ఎంవీపీకాలనీ: వైఎస్సార్‌సీపీతో ముస్లింలది విడదీయరాని బంధమని ఎంపీ, పార్టీ రీజినల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి అన్నారు. వెంకోజీపాలెం సీఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం రాత్రి ముస్లింల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ముస్లిం రిజర్వేషన్లు తీసుకొచ్చిన ఘనత దివంగత వైఎస్సార్‌కు దక్కుతుందన్నారు. ఆయన అడుగుజాడల్లోనే సీఎం జగన్ ముస్లింల సంక్షేమానికి విశేష కృషి చేస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో ముస్లింల రాజకీయ ప్రాధాన్యం పెంచేందుకు పెద్ద ఎత్తున కృషి చేస్తున్నారన్నారు. ఇందులో భాగంగానే గత ఎన్నికల కంటే ప్రస్తుత సార్వత్రిక ఎన్నికల్లో ముస్లింలకు ఎక్కువ అసెంబ్లీ సీట్లు కేటాయించినట్లు చెప్పారు. 2019లో 5 కేటాయిస్తే, 2024లో ఆ సంఖ్యను 7కు పెంచారన్నారు. ముస్లింలకు అన్ని రకాల సంక్షేమ పథకాలను జగన్ ప్రభుత్వం అందిస్తోందన్నారు. ఈ మేలును గుర్తుంచుకుని ఎన్నికల్లో ముస్లింలంతా వైఎస్సార్‌సీపీకి అండగా నిలవాలని కోరారు. వైఎస్సార్‌సీపీ తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతికి సీఎం వైఎస్ జగన్ చిత్తశుద్ధితో పనిచేస్తున్నారన్నారు. మానవీయత, నిజాయితీ, నిస్వార్థానికి ప్రతీకగా నిలిచే ముస్లింలు.. రాష్ట్రానికి, ప్రజలకు మంచి చేస్తున్న సీఎం జగన్‌కు అండగా నిలవాలన్నారు. రాష్ట్ర మైనారిటీ సెల్ అధ్యక్షుడు ఫరూఖీ, వీఎంఆర్‌డీఏ చైర్మన్ సనపల చంద్రమౌళి, బోణి శివరామకృష్ణ, 53వ వార్డు కార్పొరేటర్ బర్కత్ అలీ, ఎ.షరీఫ్, అటవీ కార్పొరేషన్ డైరెక్టర్ గుజ్జు వెంకటరెడ్డి, పలువురు ముస్లిం నాయకులు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

51 శాతం ఓట్లు సాధించిన క్రియేటర్ సీఎం జగన్

- జగన్‌తో పెట్టుకుంటే ప్రజలే పవన్‌ను తొక్కి నారతీస్తారు..
- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి



మాట్లాడుతున్న వరుదు కల్యాణి

బీచ్ రోడ్డు: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 1972 తర్వాత 51 శాతం ఓట్లు సాధించి 151 ఎమ్మెల్యేలు, 22 ఎంపీ స్థానాలను గెలిచిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక క్రియేటర్ అని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి అన్నారు. సిరిపురంలోని ఆమె తన కార్యాలయంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రిని క్రిమినల్, రౌడీ అని అంటున్న పవన్.. గతంలో గన్ పట్టుకుని రోడ్లపైన తిరిగింది ఎవరని ప్రశ్నించారు. జగన్‌తో పెట్టుకుంటే ప్రజలే పవన్‌ను తొక్కి నారతీస్తారని హెచ్చరించారు. టీడీపీ, జనసేన నాయకులు ఏమీ చెప్పిన ప్రజలు నమ్మడం లేదని చెప్పి, సీఎంపై వ్యక్తిగత దూషణలకు దిగుతున్నారన్నారు. 2014లో అధికారం చేపట్టిన కూటమి అప్పట్లో ఏమీ చేసిందో చెప్పి ఓట్లు అడగకుండా.. పవన్ కల్యాణ్ విశాఖలో మాట్లాడిన మాటలకు ప్రజలు అసహ్యించుకుంటున్నారన్నారు. సోనియాగాంధీ, చంద్రబాబులకే బయపడలేదు.. అలాంటిది పవన్ కల్యాణ్‌ని చూసి బయపడతారా? అని ఎద్దేవ చేశారు. పవన్ కల్యాణ్ పార్టీ పెట్టిన తరువాత ఈ పదేళ్లలో కాలంలో సీఎం జగన్ ఆయన పేరు కూడా కనీసం ఎత్తలేదంటే పవన్ స్థాయి ఏంటో అర్థం చేసుకోవాలన్నారు. రాజకీయ జీవితంలో తనకు అంటూ ఒక పేజీ కూడా లేని వ్యక్తి ఉన్నారంటే అది పవన్ కల్యాణే అని ఎద్దేవ చేశారు. జగనన్న అందర్నీ కూర్చోబెట్టి ఆడిస్తున్నాడని అంటున్న పవన్‌ను చేతిలో కీలుబొమ్మగా చేసుకుని ఆడుతున్నది చంద్రబాబు అని రాష్ట్ర ప్రజలకు తెలుసన్నారు. విశాఖలో ఆస్తులు లాగేసుకుంటున్న దండుపాళ్యం బ్యాచ్ టీడీపీ నాయకులేనని, దానికి నాయకుడు చంద్రబాబు అని ఆమె ఆరోపించారు. విశాఖ ప్రచారంలో పవన్ పక్కన ఉన్న గీతం చైర్మన్ భరత్ 40 ఎకరాల ప్రభుత్వ భూములను కబ్జా చేశారని విమర్శించారు. అటువంటి ఆయన్ను జగదాంబ జంక్షన్‌లో నిల్చోబెట్టి మోకాళ్లు ఎప్పుడు విరగ్గొడతారని ఆమె ప్రశ్నించారు. గతంలో గంటా శ్రీనివాసరావు భూకబ్జాలు చేశాడని స్వయంగా పవన్ చెప్పారని, మరి ఆయనకు ఎప్పుడు మోకాళ్లు విరగ్గొట్టి జగదాంబ సెంటర్‌లో కూర్చోబెడతారన్నారు. ప్రభుత్వ భూమిని కబ్జా చేసి తిరిగి ప్రభుత్వానికి అమ్మేసిన అనితను ఎప్పుడు కూర్చోబెడుతున్నారో చెప్పాలని నిలదీశారు. రూ.5,700 కోట్లు బ్యాంకులకు కుచ్చు టోపి పెట్టిన సుజనా చౌదరికి జనసేన సీటును అమ్ముకున్నారని ఆరోపించారు. వైఎస్సార్‌సీపీని గెలిపిస్తే కడప రౌడీలు, గూండాలు వచ్చేస్తారు అంటున్న పవన్.. ఈడీ కేసుల్లో ఉన్న, భూకబ్జాలు చేసిన వ్యక్తిని కడప నుంచి తీసుకొని వచ్చి అభ్యర్థిగా నిలబెట్టింది మీరు కాదా అని ప్రశ్నించారు. చేగువీరా స్ఫూర్తి ఉంటే బీజేపీతో పొత్తు పెట్టుకుంటారా.. అలాగే గద్దర్ స్ఫూర్తి అని చెప్పుకుంటున్న మీరు.. ఆయన గుండెల్లో బుల్లెట్లు దింపిన చంద్రబాబుతో జోడీ కట్టిన మిమ్మల్ని ఏమి అనాలి అంటూ పవన్‌ను ఆమె ప్రశ్నించారు. విశాఖ వచ్చిన పవన్ స్టీల్ ప్లాంట్ గురించి గానీ, రైల్వే జోన్ కోసం గానీ మాట్లాడకపోవటం సిగ్గుచేటు అన్నారు. త్వరలో జరిగే మోదీ సభలో స్టీల్‌ప్లాంట్ కోసం, రైల్వే జోన్, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ గురించి మాట్లాడించే దమ్ము ఉందా? అని ఆమె సవాల్ విసిరారు. కేంద్రంలో ఎన్‌డీఏ అధికారంలోకి వస్తే ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ అమలు చేయమని మోదీతో చెప్పించే ధైర్యం ఉందా? అని ప్రశ్నించారు. మరో పది రోజుల్లో జగనన్నే మళ్లీ ముఖ్యమంత్రి కాబోతున్నారని, దాన్ని చూడ్డానికి ప్రతి పక్షాలు సిద్ధంగా ఉండాలన్నారు.

ఈవీఎంల సప్లిమెంటరీ ర్యాండమైజేషన్ పూర్తి

మహారాణిపేట: విశాఖ పార్లమెంట్ నియోజకవర్గ స్థానం పరిధిలో వినియోగించనున్న ఈవీఎంల సప్లిమెంటరీ ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తయ్యింది. ఇది వరకే ర్యాండమైజేషన్ పూర్తయినప్పటికీ పార్లమెంట్ బరిలో 33 మంది అభ్యర్థులు పోటీ పడుతున్న నేపథ్యంలో అదనంగా బ్యాలెట్ యూనిట్ వినియోగిస్తున్న క్రమంలో శుక్రవారం కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, సాధారణ పరిశీలకుడు అమిత్‌శర్మ.. రాజకీయ పార్టీల అభ్యర్థుల సమక్షంలో కలెక్టరేట్ వీసీ హాల్‌లో ఈ ప్రక్రియను పూర్తి చేశారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు పార్లమెంట్ నియోజక వర్గ పరిధిలోని 1,962 పోలింగ్ కేంద్రాల్లో వినియోగించేందుకు అనువుగా ఆన్‌లైన్ విధానం ద్వారా ఈవీఎంలను కేటాయించారు. కార్యక్రమంలో ఈవీఎంల నోడల్ అధికారి టి.ప్రవీణ, ఎన్నికల సెల్ అధికారి మూర్తి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

బాలల పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

విశాఖ విద్య: జాతీయ బాలల పురస్కారాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తూ స్త్రీ శిశు సంక్షేమశాఖ ఉత్తర్వులు జారీ చేసినట్లు రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు డాక్టర్ గొండు సీతారాం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన 5 నుంచి 18 ఏళ్ల లోపు వయసు గల బాలలు ఈ పురస్కారాలకు అర్హులని పేర్కొన్నారు. సామాజిక సేవ, సాంకేతిక పరిజ్ఞానం, విద్య, ధైర్య సాహసాలు, పర్యావరణం, క్రీడలు, కళలు, సాహిత్యం, సంగీతం, నృత్యం, చిత్రలేఖనం తదితర అంశాల్లో ప్రతిభావంతులకు ఇదో అరుదైన అవకాశమని తెలియజేశారు. 2025 జనవరిలో రాష్ట్రపతి చేతుల మీదుగా పురస్కారాన్ని అందుకోవచ్చన్నారు. అర్హత, ఆసక్తి గల బాలలు జూలై 31 లోపు http:/awards.gov. in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆయా రంగాల్లో ప్రతిభ చూపే విద్యార్థులు దరఖాస్తు చేసుకునేలా ఉపాధ్యాయులు, వివిధ సంస్థల వారు, తల్లిదండ్రులు శ్రద్ధ తీసుకోవాలని కోరారు.

పిల్లలు, వృద్ధులకు సదుపాయాలు కల్పించండి

పెందుర్తి: చందనోత్సవంలో భక్తులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేయాలని శ్రీశారదాపీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి స్వామీజీ దేవదాయశాఖ అధికారులకు సూచించారు. చందనోత్సవం ఏర్పాట్లను శుక్రవారం చినముషిడివాడ పీఠంలో దేవదాయ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ, రాజమండ్రి ఆర్‌జేసీ సుబ్బారావు, సింహచలం ఈవో శ్రీనివాసమూర్తి బృందం స్వామీజీని కలిశారు. పలు కీలక అంశాలపై చర్చించి స్వామీజీ సలహాలు తీసుకున్నారు.

6న ప్రధాని రాక

మహారాణిపేట: భారత ప్రధాని నరేంద్ర మోదీ ఈనెల 6న అనకాపల్లి రానున్నారు. రాజమండ్రి నుంచి హెలికాప్టర్‌లో సాయంత్రం 5.30 గంటలకు అనకాపల్లి దరి రాజుపాలెం వస్తారు. అక్కడ నుంచి బహిరంగ సభ వేదిక వద్దకు రోడ్డు మార్గంలో వస్తారు. సాయంత్రం 5.45 గంటల నుంచి 6.35 గంటల వరకు బహిరంగ సభలో ప్రసంగిస్తారు. అక్కడ నుంచి రాత్రి 7.10 గంటలకు రోడ్డు మార్గం ద్వారా విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారు. రాత్రి 7.15 గంటలకు ప్రత్యేక విమానంలో అహ్మదాబాద్‌కు బయలు దేరుతారు.

మెడికల్ విద్యార్థి దుర్మరణం

- మరో ఇద్దరి పరిస్థితి విషమం
- ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొనడంతో ఘటన



ఘటన స్థలంలో మృతి చెంది ఉన్న షేక్‌జానీ

మల్కాపురం: వైద్యులుగా స్థిరపడాలని ఎన్నో కలలగన్నారు. చదువు కోసం జిల్లాలు దాటి విశాఖ వచ్చారు. శుక్రవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా.. మరో ఇద్దరు ప్రాణాలతో కొట్టుమిట్టాడుతున్నారు. వివరాలు ఇలా.. గుంటూరు జిల్లా పిడుగురాళ్ల ప్రాంతానికి చెందిన షేక్‌జానీ, అనంతపురం ప్రాంతానికి చెందిన సత్యకుమార్, శ్రీకాకుళానికి చెందిన ప్రమోద్‌లు కొమ్మాదిలోని గాయత్రి మెడికల్ కళాశాలలో మెడిసన్ ప్రథమ సంవత్సరం చదువుతున్నారు. ఈ ముగ్గురు ఒకే ద్విచక్రవాహనంపై యారాడ, గంగవరం బీచ్‌కు శుక్రవారం తెల్లవారుజామున బయలుదేరారు. మల్కాపురం పోలీసు స్టేషన్ రోడ్డు నుంచి సింధియా వైపు వెళుతుండగా షిప్‌యార్డ్ కమర్షియల్ కాంప్లెక్స్ సమీపంలో ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొట్టారు. ఈ సంఘటనలో షేక్‌జానీ అక్కడికక్కడే దుర్మరణం చెందగా.. సత్యకుమార్, ప్రమోద్‌కు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ప్రాంతంలో డివైడర్ పనులు జరుగుతున్నాయి. తవ్విన వ్యర్థాలను తరలించేందుకు అక్కడ ట్రాక్టర్ నిలిపారు. ఇది గుర్తించని యువకులు ట్రాక్టర్‌ను ఢీకొట్టారు. తీవ్రంగా గాయపడిన వారిని కేజీహెచ్‌లో చేర్పించారు. ప్రస్తుతం వారి పరిస్థితి విషమంగా ఉంది. షేక్‌జానీ మృతదేహాన్ని కేజీహెచ్ మార్చురీకి తరలించారు. జరిగిన సంఘటనపై విచారణ జరుపుతున్నామని మల్కాపురం ఇన్‌చార్జ్ సీఐ దాశరథి చెప్పారు.

ఫార్మాసిటీలో ఐదుగురు కార్మికులకు అస్వస్థత

పరవాడ : స్థానిక ఫార్మాసిటీలోని అజినోమోటో పరిశ్రమలో గురువారం విష వాయువుల లీకైన ఘటనలో ఐదుగురు కార్మికులు అస్వస్థతకు గురయ్యారు. పరిశ్రమ యాజమాన్యం గుట్టుచప్పుడు కాకుండా బాధిత కార్మికులను నగరంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తోంది. శుక్రవారం ఉదయం పరవాడ పోలీసులకు సమాచారం అందడంతో ఆస్పత్రికి వెళ్లి అస్వస్థతకు గురైన కార్మికుల వివరాలను సేకరించారు. ఈ విషయాన్ని పరవాడ సీఐ ఎస్.బాలసూర్యారావు వద్ద ప్రస్తావించగా.. పరిశ్రమలో విషవాయువులు ఏ విధంగా బయటకు వచ్చాయన్న విషయంపై వివరాలు సేకరిస్తున్నామని, అస్వస్థతకు గురైన కార్మికులు సుధాకర్, సతీష్, వర్మ, రామునాయుడు, ఎస్.సాయిల పరిస్థితి మెరుగ్గా ఉందని చెప్పారు. బాధిత కార్మికులకు మెరుగైన వైద్యం అందించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. ప్రమాదంపై సమగ్ర విచారణ జరిపించాలని కోరారు.

బాలయ్య.. ఇదేం బాలేదయ్యా..!

- కంచరపాలెం బహిరంగ సభలో ఊకదంపుడు ప్రసంగం
- వినలేక విసుగేసి వెనుదిరిగిన జనం



ప్రచార రథంపై మాట్లాడుతున్న సినీ నటుడు బాలకృష్ణ

కంచరపాలెం: అసలే నందమూరి నటసింహం..ఆయన సభకు జనం లేకపోతే టీడీపీ స్థానిక నేతలకు దబిడి దిబిడే. కాళ్లోవేళ్లో పట్టుకుని మనిషికి రూ.200 ఇచ్చి మరీ టీడీపీ నేతలు జన సమీకరణ చేశారు. అయితే బాలయ్య తనమార్కు డైలాగ్‌లతో ప్రజలను విసిగించాడు. మరీ ఆనాడు...అంటూ ప్రారంభించి తలాతోకలేని మాటలతో విసుగుతెప్పించాడు. కంచరపాలెం మెట్టు ప్రధాన రహదారిపై శుక్రవారం నిర్వహించిన ఎన్నికల ప్రచార సభ 5.45 గంటలకు ప్రారంభించాల్సి ఉండగా..రాత్రి 7.20 గంటలకు బాలకృష్ణ రావడంతో జనం రోడ్లపై నిలబడలేక ఊసూరుమన్నారు. మైక్ అందుకున్న బాలయ్య ముఖ్యమంత్రి వైఎస్ జగన్ బదులు సీఎం జీవన్ అంటూ నోరుతిరగని పదాలతో జనాన్ని అయోమయంలో పడేశాడు. స్థానిక టీడీపీ, బీజేపీ అభ్యర్థుల కోసం కాకుండా తన తండ్రి ఎన్టీఆర్ సేవల గురించి చెప్పుకున్నాడు. చంద్రబాబు కోసం అంతంత మాత్రమే మాట్లాడగా.. ఇక పవన్ కల్యాణ్ గురించి అసలు ప్రస్తావనే లేదు. రాష్ట్రాభివృద్ధి కోసం టీడీపీ అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందన్నారు. అర్థం కాని మాటలు, సినీ డైలాగ్‌లతో బాలకృష్ణ బోర్ కొట్టించాడు. ఐటీఐ కూడలిలో బాలకృష్ణకు పూలదండ వేసేందుకు భారీ క్రేన్‌ను టీడీపీ నాయకులు అడ్డంగా పెట్టడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సభా వేదిక వద్ద టీడీపీ పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి ఎన్నికల ప్రచార రథాలపై మహిళలు సినీ గీతాలకు డ్యాన్స్ చేస్తున్నా.. పోలీసులు చూసీచూడనట్లు వ్యవహరించారు. బీఆర్‌టీఎస్ రోడ్డులో కార్యకర్తలు అడ్డంగా ఉండటంతో అంబులెన్స్ వెళ్లేందుకు దారి లేక చాలాసేపు అక్కడే నిలిచిపోయింది.

డీఈఐలో కోర్సులకు దరఖాస్తులు

ఆరిలోవ: దయాల్‌నగర్‌లో దయాల్‌బాగ్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూట్‌లో మూడేళ్ల వ్యవధి గల వివిధ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఇన్‌స్టిట్యూట్ ఇన్‌చార్జి దక్షిణామూర్తి తెలిపారు. డిప్లమో ఇన్ ఎల్రక్టానిక్స్ ఇంజినీరింగ్ కోర్సు కోసం అభ్యర్థులు పదో తరగతిలో ఉత్తీర్ణులై ఉండాలన్నారు. బ్యాచిలర్ ఆఫ్ ఒకేషనల్ హార్టికల్చరల్ టెక్నాలజీ కోర్సులకు ఇంటర్మీడియెట్, పాలిటెక్నిక్ చదివిన విద్యార్థులు అర్హులని, వీరికి వయోపరిమితి లేదని తెలిపారు. ఆసక్తిగల వారు ఈ నెల 20 లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.